# థేంక్స్ టు ది ఇంగ్లీషమన్

'ఇదే మా ఆడిటోరియం' అన్నాడు జయరాం తమ ఆఫీసు కల్చరల్ అసోసియేషన్ వాళ్ళ ఆడిటోరియం..తన కొత్త పెళ్ళాం ఇందిరకు చూపిస్తూ.

'సింపుల్‌గా వున్నా బాగుంది' అన్నది ఇందిర..పరికించి చూస్తూ.

జయరాం దారి చూపిస్తూ ముందుకు నడిచారు.

'నమస్కారం సార్..రండి!' ఎవరో ఆహ్వానించారు జయరాంని.

జయరాం నమస్కారం అందుకుంటూ ఠీవిగా లోపలకు నడిచాడు... ఇందిరతోపాటు.

'ఈ చుట్టుప్రక్కల వున్న గవర్నమెంటు ఆఫీసులలోని వాళ్ళంతా కలసి స్థాపించారు

ఈ కల్చరల్ అసోసియేషన్.నెలకోసారి ఏ మ్యూజిక్ ప్రోగ్రామో, డాన్సు ప్రోగ్రామో వుంటుంది. వూళ్ళో వున్న బిగ్‌షాట్స్‌ని కూడా పిలుస్తుంటాం' మల్లెపూలతో ఘుమఘుమలాడుతున్న ఇందిర జడను చేత్తో ప్రక్కకు నెట్టి చెవిలో అన్నాడు జయరాం.. ఎదురుగా వస్తున్న జిల్లా కలక్టర్‌ని చూపించి.

ఇందిర తల పంకించింది..తల్లోని మల్లెమొగ్గలోమారు సర్దుకొని.

'సుభద్రా వెంకటరామన్' పాట కచేరీ యింతకు ముందోమారు విన్నాను.. త్యాగ రాజ కీర్తనలు చాలా బాగా పాడుతుంది' అన్నది ఇందిర. మనసు లో ఆ ప్రోగ్రాంకి పిలుచుకు వచ్చిన జయరాంని మెచ్చుకుంటూ.

ఇంకా తెర లేవలేదు. జనం మెల్ల మెల్లగా వస్తున్నారు.

వాతావరణం చాలా ఆహ్లాదకరంగా వుంది. రకరకాల వ్యక్తులు రకరకాల దుస్తులతో మంచి శోభనిస్తున్నారు కార్యక్రమానికి.

ముందు వరుసలో కూర్చుని వున్న సన్నగా, పొడుగ్గా, ఎర్రగా వున్న వ్యక్తి ఒకతను చటుక్కున తన కుర్చీలో నించి లేచి ముందుకు నడచి ఒక పొడగాటి శాల్తీని లోపలకు ఆహ్వానిస్తున్నాడు. ఆయన వెనకనే వస్తున్న ఆయన భార్యకి, నమస్కారం చేశాడు. అంతేకాదు. ప్రక్కనే వున్న ఆయన పిల్లవాడికి జేబులోనించి ఓ చాకలెట్ తీసి అందించాడు. ఆయన మాత్రం చాలా గంభీరంగా వచ్చి ముందు సీట్లో పేము కుర్చీలో కూర్చున్నాడు.

'ఆ సన్నగా, పొడుగ్గా, ఎర్రగా వున్నతను ఫలానా ఆఫీసులో ఫలానా వుద్యోగం చేస్తున్నాడు. ఇప్పుడతను లోపలకు పిలిచినది వాళ్ళ మేనేజర్‌ని. ఆవిడ ఆయన భార్య.. చూశావా ఎంత కాకా పట్టేస్తున్నాడో?' అన్నాడు జయరాం.

'ఛ.. మర్యాద కోసం లోపలకు ఆహ్వానిస్తే తప్పేముందండి' అన్నది ఇందిర మెల్లగా.

జయరాం నవ్వాడు. 'మర్యాదా - ఈ ఆఫీసుల్లో వాళ్ళకి మర్యాద తీసుకోవటం తెలిస్తేకదా మేం యివ్వటం. అదంతా కాకాలూకీయం డార్లింగ్..చూస్తుండు - నీకే తెలుస్తుంది!' అన్నాడు.

ఇందిర వింతగా చూసింది.

మేనేజర్ కుర్చీలో కూర్చోబోయేటప్పుడు, ఆయన హాండ్‌కర్చీఫ్ క్రిందపడి పోయింది. అది ఆయన గమనించలేదో, గమనించీ ఎందుకని ఆగాడో తెలుసుకోవటం కష్టం. అది ఆ ఫలానా ఉద్యోగి చూసి గబగబా వెళ్ళి కర్చీఫ్ తీసి దాన్ని తన కర్చీఫ్‌తో శుభ్రంగా తుడిచి, ఆయనకు అతి వినయంతో అందించి, ఒకడుగు వెనక్కి వేశాడు.

ఆయన, అతన్ని ఈగని చూసినట్టు చూసి చటుక్కున కర్చీఫ్ లాక్కుని తన భార్య వేపు గంభీరంగా చూశాడు. ఆయన భార్య యింకా గంభీరంగా చూస్తున్నది...ముందు కుర్చీలో కూర్చున్న ఆయన బట్టతల ఎందుకు అంత నిగనిగా మెరుస్తున్నదా అని.

అతను ఒకే నిమిషం అక్కడ నుంచుని ఏదో మాట్లాడబోయి ఆగి...వెనక్కు వెళ్ళి ఎక్కడో దూరంగా - మేనేజర్ చూపులకు అందనంత దూరంగా వెళ్ళి సిగరెట్ వెలిగించాడు.

'యిప్పుడేమంటావ్!' అన్నాడు జయరాం గర్వంగా.

మూతి ముడిచి ముచ్చటగా నవ్వింది ఇందిర..చుట్టుప్రక్కల్ని మరచిపోయి..జయరాం కళ్ళలోకి మత్తుగా చూస్తూ.

జయరాం ఆమె చేతి మీద చేయి వేశాడు.

ఎదురుగా వస్తున్న ఒకాయన్ని చూపిస్తూ అన్నాడు జయరాం...'ఆయన ఫలానా' ఆఫీసర్. ఆయన ఏం చేస్తాడో తెలుసా. సరిగ్గా అయిదు నిముషాల తక్కువ అయిదింటికి ఆఫీసుకి వస్తాడు రోజూ బయల్దేరదామని ఫైళ్ళు సర్దబోతున్న వాళ్ళందరూ..మళ్ళీ ఫైళ్ళు ముందేసుకుని కూర్చుంటారు. అంతే.. రాత్రి ఎనిమిదింటికీ, ఒక్కోరోజు తొమ్మిదీ, పదీ కూడా అవుతుంది ఆయన కుర్చీలో నించి లేచేసరికి.. అప్పటిదాకా వాళ్ళలా కూర్చోవలసిందే. ఇంట్లో పెళ్ళాన్ని డాక్టర్‌కి చూపించాలనుకున్నా, ముద్దుగా పెరుగుతున్న పిల్లవాడిని ముచ్చటగా ఒకళ్ళో కూర్చోబెట్టుకుని లాలిద్దామనుకున్నా, బజారు నుంచి సామాన్లు తేవాలనుకున్నా.. యిక గోవిందే...'

'మరి.. ఆయన మాత్రం యింట్లో పనులు చూసుకోడా?'

'ఆహా! ఎందుకు చూసుకోడూ.. సరిగ్గా నాలుగున్నరదాకా చూసుకుంటాడు. కావాలనే అయిదింటికి కొద్దిగా ముందుకు వస్తాడు. అదో దరిద్రపు బుద్ధి ఆయనకి. అదీకాక యింటి నిండా నౌకర్లూ, చాకర్లూ, ఆయన బజారు పోవాలా... యింటి వెచ్చాలు తేవాలా...' కసిగా అన్నాడు జయరాం.

'అదేం బుద్ధండీ...అంతా యింతేనా!'

'అంతా అని అనలేం ఇందూ! కాని చాల మంది అంతే... పైగా అంత పని చేసినా ఎప్పుడూ ఆయన పై ఆఫీసర్ల దగ్గర్నించి కంప్లైంట్లే పని జరగటం లేదని...'

'మరి వాళ్ళు రోజూ ఎనిమిదింటిదాకా..'

నవ్వాడు జయరాం. 'అది అంతే ఇందిరా.. బలవంతాన కూర్చోపెట్టి పనిచేయిస్తే ఏం జరుగుతుంది? ఆయన్ని బట్టే ఆయన క్రింది ఉద్యోగులు!'

ఇందిర కూడా నవ్వింది. ఆ నవ్వుని అలా దోసిట్లో దాచేసుకుందామనుకున్న జయరాం ఆగిపోయాడు.

'ఇంకా తెరతీయరేం...' అంటున్న ఇందిర కూడా చటుక్కున ఆగిపోయింది.

కారణం...మరేంలేదు. అంత గంభీరంగా కూర్చున్న మేనేజరూ ఒక్కసారిగా పిల్లిగా అయిపోయారు. సడన్‌గా లేచి నుంచున్నాడు.. ఆయనతోబాటు ఆయన భార్య కూడా లేచి నుంచున్నది.

విచిత్రంగా చూసింది ఇందిర.

'నమస్తే సార్ రండి' మేనేజర్ గబగబా ఎదురువెళ్ళి సన్నగా, పొట్టిగా, నల్లగా చింతమొద్దులా వున్న ఒకాయన్ను ఆహ్వానించాడు. ఆయన వెనకనే వస్తున్న ఆయన భార్యను, మేనేజర్ గారి పెళ్ళాం రిసీవ్ చేసుకుంది. మేనేజర్ అప్పటిదాకా తను కూర్చున్న కుర్చీలో ఆ వచ్చిన ఆయన్ను, ఆయన భార్యనీ కూర్చోబెట్టి చేతులు కట్టుకు నుంచున్నారు.

'ఆయన వాళ్ళ ఆఫీసర్. అందుకే అంత వినయవిధేయతలు చూపిస్తున్నాడాయన'

అన్నాడు జయరాం ఇందిర చేతిని సున్నితంగా వత్తుతూ.

ఇందిర తల పంకించింది.

'ఏమయ్యా... మా అమ్మాయి కాలేజి సీటు సంగతి కనుక్కున్నావా?' అడిగాడు ఆఫీసర్.

'అయ! కనుక్కున్నానండి..యాభై రూపాయలు డొనేషన్ కట్టాలన్నారండి. అదీ కట్టేశాను సార్!' గుర్రుగా చూస్తున్న భార్యను, గమనించనట్టుగా చూస్తూ అన్నాడు మేనేజర్.

ఆఫీసర్ థాంక్స్ చెప్పలేదు. చిరునవ్వు నవ్వలేదు. కళ్ళల్లో కృతజ్ఞతను చూపలేదు. 'ఊ!' అన్నాడు.

తెరలేచింది. సుభద్రా వెంకట్రామన్ పరిచయం అయాక కచేరి మొదలు పెట్టింది.

'కూచోవయ్యా నుంచుటావేం!' గొణిగాడు ఆఫీసర్ సన్నగా.

'అయ!' అటూ వెనక్కి వెళ్ళి కూర్చున్నాడు మేనేజర్ పెళ్ళాంతో సహా.

'ఛీ! యిదేం డిపార్టుమెంటండీ.. వాళ్ళకి అభిమానం అంటూ వుండదూ...అంత చదువూ చదివి అలా ప్రవర్తిస్తారేం! కనీసం..ఏమండి అని మర్యాదగా అన్నా పిలవరేం... అదేం సంస్కారం.. అయినా ఈయన మాత్రం అంత పిల్లిలా అయిపోతాడేం!' అన్నది ఇందిర.

'ఇక్కడ అంతే ఇందిరా.. నీకు తెలీదు.. అలా ఉండకపోతే ఈ డిపార్టుమెంటులో వుండలేరు...'

'ఆ! వుండి మాత్రం ఏం లాభం? హాయిగా యింకోచోట చేరవచ్చు. మరీ యింత బాసింగ్ అయితే ఎలా అండీ... ఆఫీసుల్లో అయితే కొంత నయం. యిలాటి కల్చరల్ ప్రోగ్రాంస్‌లో కూడా యింతేనా...జ్ఞానం వుండద్దూ... మరీ ఈ డిపార్టుమెంటులోనే యింత అసహ్యకరమైన ప్రవర్తన...'

'అవును ఇందూ..మా డిపార్టుమెంటులోనే యింత విపరీత ధోరణి..అది అంతే...' అన్నాడు జయరాం.

'మరి మీరూ యింతేనా!' అన్నది ఇందిర.

'ఛ..ఛస్తే అటువంటి పనులు చేయను..నాకామాత్రం మానాభిమా నాలు వున్నయ్ ఇందూ...ఇంత చదువూ చదివి అంత సిగ్గు లేకుండా ప్రవర్తిస్తానా.. నాకింద పనిచేసే వాళ్ళని నాతో సమానంగా గౌరవిస్తున్నాను. నా పైవాళ్ళకి ఎంత మర్యాద యివ్వాలో అంతా యిస్తున్నాను... ఒకళ్ళ కోసం నా ఆశయాలకు సంకెళ్ళు వేయను. వేయలేను' ఆమె కళ్ళల్లోకి ముద్దుగా చూస్తూ ముద్దగా అన్నాడు జయరాం.

ఆమె చిన్నగా నవ్వి గర్వంగా చూసింది జయరాంని.

ఆఫీసర్ గారి పెళ్ళాం, ఎప్పుడు చూసిందో ఏమో.. ఇందాకటి ఫలానా వుద్యోగిని చూసింది. చూసి, అతన్ని చూపించి ఆయనతో ఏదో చెప్పింది. ఆయన ఎవరికో చెప్పి, అతన్ని పిలిపించాడు.

'బాయిలర్ బొగ్గు అయిపోయి మూడు రోజులయింది...' ఆవిడ పూర్తిగా చెప్పకముందే

సుభద్రా వెంకట్రామన్ పాడుతున్న పాట పూర్తయింది. అంతా చప్పట్లు కొడుతున్నారు. ఆవిడ కూడా చటుక్కున ముఖం మీదకు నవ్వు తెచ్చుకుని చప్పట్లు కొడుతూ 'చాలా బాగా పాడింది కదూ!' అన్నది భర్తతో.

'అవును చక్కటి కృతి పాడింది. కళ్యాణి రాగం ఈవిడ చాలా బాగా పాడుతుంది కదోయ్ నరసింహం!' అన్నారాయన వెనకనే కూర్చున్న మేనేజర్‌తో.

'అవును! చక్కటి కృతి పాడింది. కళ్యాణి రాగం ఈవిడ చాలా బాగ పాడుతుంది కదోయ్ నరసింహం!' అన్నాడాయన వెనకనే కూర్చున్న మేనేజర్ తో.

'ఎస్సార్ చాలా బాగా పాడింది..పాడుతుంది!' అటెన్షన్‌లోకి వచ్చి అన్నాడు మేనేజర్.

మేనేజర్ పెళ్ళాం మెల్లగా అంది - 'ఆ పాట కళ్యాణి రాగం కాదండీ.కాంభోజి రాగం!' తన సంగీత జ్ఞానం వుపయోగించి.

'ఛీ నోర్మూయ్ అది కళ్యాణి రాగమే!' అన్నాడు మేనేజర్ ఆవిడ చెవిలో.

ఆవిడ మాట్లాడలేదు.

సుభద్రా వెంకట్రామన్ యింకో కీర్తన అందుకుంది.

'ఏమిటి అంటున్నాను... ఆ! బాయిలర్ బొగ్గు అయిపోయి మూడు రోజులయింది... రేపు ప్రొద్దున్నే తీసుకురావాలి. తెలిసిందా.. ఎన్నాళ్ళని ఆగాలి!' గట్టిగా అడిగిందావిడ భర్తవేపు ఒకసారి చూసి.

'అవును ఎన్నాళ్ళని ఆగాలి! రేపు ప్రొద్దున్నే ఒక బస్తా వేయించు' అన్నారాయన.

అతను మాడిపోయిన ముఖం మీద చిరునవ్వు పులుముకుని - 'ఎస్సార్' అని నమస్కారం చేసి జేబులోని సిగరెట్ పెట్టె తడుముకుంటూ జనంలో డిసాల్వ్ అయిపోయాడు.

'చూశావా..యిదీ వరస..స్వంత పనులు చేయించుకోవటానికి వాళ్ళకి బుద్ధీ జ్ఞానం లేదనుకో..చేసేవాళ్ళకి అయినా వుండక్కర్లా..'

'అవును..మన రక్తంలో ఇంగ్లీషువాళ్ళు బానిసత్వం నింపి వెళ్ళారు.. వాళ్ళు దేశాన్ని వదిలినా, అది వదలనంటున్నది వీళ్ళని...ఏం చేస్తారు పాపం!' అదోరకంగా నవ్వింది ఇందిర.

'వాళ్ళ గొప్పతనం నేర్చుకోకపోయినా కనీసం యిదన్నా వంటబట్టింది మనకి.. థేంక్స్ టుది ఇంగ్లీష్‌మన్!' అన్నాడు జయరాం.

భర్త భుజం మీద తలవాల్చి అరమోడ్పు కళ్ళతో చెవులు రిక్కించి పాటవింటున్న ఇందిర, ఉన్నట్టుండి వులిక్కి పడింది. జయరాం ఆమెను ఒక్కసారిగా విదిలించేసరికి అతన్ని తేరిపార జూడబోయింది. కానీ అతడు అక్కడ లేడు. గేటు వేపు చూసింది. ఒక చిన్నపిల్లవాడ్ని ఎత్తుకొని నవ్వుతూ ఒక లావుపాటి ఆయనకు దారి చూపిస్తూ వస్తున్నాడు జయరాం.

ఆ లావుపాటి శాస్త్రీ అంటున్నాడు - 'రేపొద్దున్న ఒకసారి రావయ్యా.. మా ఆవిడ అవుటాఫ్ డోర్స్ హోటల్నుంచి కారియర్ అదీ...'

తరువాత ఇందిరకేమీ వినపడలేదు... తల వూపుతున్న జయరాం కనబడ్డాడు.

✿